క్లుప్తంగా

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండడంతో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కుమారషష్టి పూజలు



ప్రత్యేక అలంకరణలో బాలకుమారస్వామి

మదనపల్లె సిటీ : కుమార షష్టి పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని శివాలయాల్లో శనివారం సుబ్రమణస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్థానిక దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో బాల కుమారస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామికి అర్చకులు ఫణిస్వామి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామికి అయిదు రకాల ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వర స్వామి ఆలయంలోని శ్రీ వల్లి సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం జాతీయస్థాయిలో ఇటీవల ముంబైలో జరిగిన రోప్‌స్కిప్పింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని క్రీడల్లో రాణించి చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో పీడీలు అన్సర్, సుధాకర్,దేవకమ్మ, గోపి, నాగరాజ, బ్యూలా సంగీత, ఉపాధ్యాయులు ఫణీంద్ర, మహమ్మద్‌ఖాన్, ఆర్.వి.రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణ సమష్టి బాధ్యత

మదనపల్లె సిటీ : సంస్కృతి పరిరక్షణ సమష్టి బాధ్యత అని ప్రముఖ మతగురువు మౌలానా నయాజ్ అహ్మద్ బాఖవీ, ప్రముఖ ఉర్దూ కవి ఖమర్ అమీని అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 'ఇస్లాం-షరీయత్ ప్రకారం పిల్లల పేర్లు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులు పిల్లల పేర్లు పెట్టే సమయంలో అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరి కొందరు సినిమా నటీనటుల పేర్లు పెడుతుంటారని తెలిపారు. ఏ పేర్లు పిల్లలకు పెట్టాలి,ఆ సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు గురించి తల్లిదండ్రులకు అవగాహన కోసం ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఇస్మాయిల్,ఉపాధ్యాయులు ఖాదర్‌హుస్సేన్, సయిదాబాను పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 30న మహాధర్నా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు

మదనపల్లె : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమంలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశలంవెంకటరమణరెడ్డి, సిరిపురంరామచంద్రలు పిలుపునిచ్చారు. శనివారం మదనపల్లె మార్కెట్‌యార్డులో చలో విజయవాడ మహాధర్నాకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి వర్షాలతో రైతుల పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు మేలు చేసేందుకే 'జగనన్న సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంలో వివరాలు సేకరిస్తున్న డీపీఓ ధనలక్ష్మి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : పేదలకు మేలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా వ్యవసాయఅధికారి చంద్రానాయక్, తహసీల్దార్ షేక్ మహబూబ్ చాంద్, ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని సీటీఎం, వేంపల్లెలో స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో కలిసి అధికారులు ఇంటింటికీ పర్యటించారు. అర్హత ఉండీ పొరపాటున ప్రభుత్వ పథకాలు అమలు జరగకుండా ఉంటే తమ దృష్టికి తేవాల్సిందిగా కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న సదుద్దేశంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో ప్రభుత్వ పథకాలకు అర్హుల గుర్తింపుతో పాటు ఆదాయం, కులం, బర్త్, కొత్తరేషన్‌కార్డులు, సీసీఆర్సీ కార్డులు, ఆధార్‌కు బ్యాంక్ లింకేజీ, ఆధార్‌కార్డులో మార్పులు తదితర సేవలను చేపట్టనున్నట్లు చెప్పారు. దాదాపు 11 రకాల సేవలను ఎలాంటి సర్వీసు చార్జీ లేకుండా అందిస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రస్తావించిన సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి డాక్యుమెంట్లు సేకరించి ఒక టోకెన్ నెంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నెంబర్ కేటాయిస్తామన్నారు. సంబంధిత సచివాలయాల పరిధిలో జూలై 1 తర్వాత క్యాంపులు నిర్వహించినపుడు సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లిలో 'జగనన్న సురక్ష'

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలోని 12 క్లస్టర్లలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డితో పాటు వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ప్రతి ఇంటిని సందర్శించి లబ్ధిదారుల సమస్యలను తెలుసుకొని సమగ్రంగా నమోదు చేసుకున్నారు. వచ్చే నెల1న అదే సచివాలయంలో సమస్యను పరిష్కరిస్తూ ధ్రువపత్రం అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, సర్పంచ్‌లు తమక శంకర్, భాగ్యమ్మ, ఎంపీటీసీ ప్యారీజాన్‌తో పాటు గృహ సారథులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

తంబళ్లపల్లె: ప్ర.ఆ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎల్‌డీవో లక్ష్మీపతి తెలిపారు. శనివారం కోటకొండలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌క్రాంతిపథం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను గుర్తించాలన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను తెలియజేయాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి మండల అధికారులు సచివాలయాలలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు.

ఆర్థిక అభివృద్ధి సాధించాలి

గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి, ఎంపీడీవో ఆనంద్‌కుమార్‌లు కోరారు. సామాజిక తనిఖీ పూర్తి అయిన సందర్భంగా కోటకొండలో గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. అవకాశాలను రైతులు, ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాలలో సర్పంచు అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, ఎస్ఆర్‌పి చంద్రమోహన్ , ఏపీవో అంజనప్ప, పంచాయతీ కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచితంగా ప్రభుత్వ సేవలు

గుర్రంకొండ: జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వసేవలు ఉచితంగా అందుతాయని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అమిలేపల్లెలో వలంటీర్లతో సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష పథకంపై వారికి అవగాహన కల్పించారు. రామాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష యాప్‌ను వలంటర్లతో ఒపెన్ చేయించి అందులోప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం గురించి ప్రతి కటుంబానికి తెలియజేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. యాప్‌లో ఉన్న ప్రభుత్వ సేవలను తెలియజేసి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు, ఇతర రెవెన్యూ సేవలు గాని అక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సురేంద్రబాబు, ఏపీఎం వెంకటరమణ, ఏవోనాగ శివారెడ్డి, మండలప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీరమణ, సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, జగన్మోహన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

కలకడ : గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం, ఉచితంగా వారికి సేవలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కొత్త బిసి కాలనీలో మండల , సచివాలయ అధికారుల బృందంతో పర్యటించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని నమోదు చేసుకున్నారు. జనన, మరణ, వివాహ, కుల, ఆదాయ, వంటి ధ్రువపత్రాలకు ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ , ఏపీఓ చెన్నకేశువులు, పంచాయతీ కార్యదర్శి షబానాబాను, నాయకులు రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెద్దమండ్యం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. పెద్దమండ్యంలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల నుండి సమస్యలను తెలుసుకున్నారు. వలంటీర్ యాప్‌లో ప్రజల సమస్యలను నమోదు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కుటుంబాల్లో నెలకొన్న సమస్యలు, అర్హత ఉండి ఏవైనా ప్రభుత్వ పథకాలు అందని వారు, వివిధ రకాల సర్టిఫికెట్‌లు కావాల్సిన వారి వివరాలను వలంటీర్‌లు సమగ్రంగా సేకరించాలని అన్నారు. మండల స్థాయి అధికారుల బృందం సచివాలయం స్థాయిలో జరిగే కార్యక్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, సర్పంచ్ ఎస్ బాబా, ఎంపీటీసీ జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, సచివాలయ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష

పీలేరు : సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. శనివారం మండలంలోని అగ్రహారం పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు, ప్రభుత్వం నుంచి ఏమైనా పథకాలు అందాల్సి ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందాలన్న తపన, ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో యోగా, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు రైతులకు శిక్షణ

బి కొత్తకోట : మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ వడిగలవారిపల్లి రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం గురించి రైతులకు తగు సూచనలు సలహాలు ప్రతినిధులు ఇచ్చారు. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, సర్పంచులు రవికుమార్ రెడ్డి, చంద్ర, మదనపల్లె డివిజన్ ఏడీఎస్ రామ్ మోహన్, ఏఎస్ఓ రసూల్, ఆర్‌బీకే ఇన్చార్జి అంజనేయులు, రైతులు హాజరయ్యారు.

గురుపూజ పోస్టర్ల ఆవిష్కరణ

తంబళ్లపల్లె : గురుపూజ సంగీతోత్సవం ప్రచార పోస్టర్లను అన్నమయ్య జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. చింతామణి తాలూక శ్రీక్షేత్ర కైవారం దేవాలయంలో జూలై 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే గురుపూజ సంగీతోత్సవంలో కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు కోటిరెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, కుమారమ్మ, కళాకారులు సూర్యనారాయణ, రాధ, నిర్మల పాల్గొన్నారు.

అలరించిన హరికథాగానం



హరికథా గానం చేస్తున్న గీతావాణి

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం హరికథాగానం అలరించింది. శనివారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన భాగవతారిణి జి. గీతావాణి 'రాజసుయాగం' గట్టంపై ఆలపించిన హరికథాగానం ఆకట్టుకుంది. రాత్రి వెంకటేశ్వరా నాట్య కలామండలి వారిచే రాత్రి నాటకం నిర్వహించారు. మహాభారతయజ్ఞం వద్ద ద్రౌపది సమేత ధర్మరాజుకు, శ్రీ కృష్ణునికి భక్తులు పూజలు నిర్వహించారు. గజ్జెల శీన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేద కుటుంబాల్లో వెలుగు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాల్లో వెలుగు నింపుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలోని అయ్యవారిపల్లె, వడ్డిపల్లె, జంగంపల్లె, సోమానుపల్లె, సోమానుపల్లె కాలనీ, ఎర్రాతివారిపల్లె, రెడ్డివారిపల్లె గ్రామాల్లో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డెమ్మ, నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆర్.ఐ.రమణారెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. లబ్దిదారులకు సంక్షేమ పథకాల ద్వారా చేకూని లబ్దిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మురుగునీటి కాలువలు, సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరుచేయాలని విన్నవించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థించారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే అక్కడికక్కడే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న అందిస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందన్నారు. రెండుపేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం హామీల అమలు చేశారన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఈనెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఆయా గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటుచేసి ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి, కృష్ణప్ప, రామచంద్ర, రమణ, హరిబాబు, శంకర, మల్లికార్జునరెడ్డి, లక్ష్మివెంకటరెడ్డి, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లె వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ కానుకలను శుక్రవారం లెక్కించినట్లు టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ తెలిపారు. హుండీ ఆదాయం రూ.4.66,350 వచ్చినట్లు శనివారం వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ నిశాంత్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా అనుపమ



తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ అనుపమ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ నిరంజన్‌కుమార్ రెడ్డి బదిలీపై వెళ్లారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎగువబూడిదవేడు, దిగువబూడిదవేడు, మన్యంవారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరం అనుకుంటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా సమస్యలు విన్నవించుకోవాలన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్దిదారులకు అందజేశారు. అర్హుత కలిగిన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు అందజేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలేకాక ఇవ్వనివీ అమలు చేశారన్నారు. జగనన్న పాలనలో విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందజేస్తున్నారని గుర్తు చేశారు. గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్బీకేల ద్వారా విత్తనాల నుంచి పంట అమ్మకాల వరకు అన్ని సేవలు లభిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాండురంగా, నవాజ్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, రాయుడు, మధుసూదన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనాథ రెడ్డి, హరి, రెడ్డెప్ప రెడ్డి, శ్రీరాములురెడ్డి, అమరనాథరెడ్డి, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులు నాయక్

పీలేరురూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో జూలై 22వ తేదీన నిర్వహించనున్న స్పెషల్ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులు నాయక్ అన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టులో న్యాయవాదులకు, పోలీసులకు న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహన కేసులు, భూమికి సంబంధించిన కేసుల పరిష్కారమే లక్ష్యంగా స్పెషల్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులునాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ఎవ్వరికీ చుట్టం కాదని, చట్టం ముందు అందరూ సమానులేనని పేర్కొన్నారు. సమాజంలో జీవించాలంటే కొన్ని హక్కులు ఉంటాయని, హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడరాదని, క్రమశిక్షణతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం

కలకడ : మండలంలోని ప్రతి జగనన్న కాలనీకి వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఏఈ వర ప్రసాద్ తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో శనివారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం గ్రామంలో నిర్మించిన జగనన్న కాలనీలోని కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి స్తంభాలు, నూతన ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. ప్రతి వీధికి వీధి దీపాలు ఏర్పాటు చేసేవిధంగా త్రీఫేస్ అదనపు లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలు త్వరతిగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు ముందే అన్ని లైన్లు లాగి, పంచాయతీ నుంచి విద్యుత్ దీపాలు వెలిగించే విధంగా చేస్తామన్నారు. అలాగే కలకడ, బాటవారిపల్లె, కోన పంచాయతీలలో కూడా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు డాక్టర్ జనార్దన్‌నాయుడు, గుర్రప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం, రమణ, లైన్‌మెన్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు. సిబ్బంది.

సమష్టి కృషితో సంస్థకు మంచి పేరు తీసుకురావాలి

మదనపల్లె సిటీ: సమష్టి కృషితో ఆర్టీసీ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని డీపీటీఓఓ రాము అన్నారు. శనివారం స్థానిక వన్,టు డిపో పరిధిల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన తరువాత సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రత్యేక సర్వీసులు నడుపుతూ ప్రజల ఆదరాభిమానాలు పెంచుకోవాలన్నారు. జిల్లాలో కొత్తగా మరిన్ని సర్వీసులు రానున్నట్లు తెలిపారు. ఉద్యోగులు ఇష్టపడి పని చేయాలన్నారు. సమ్మర్‌లో ప్రత్యేక బస్సులు నడిపి సంస్థకు మంచి ఆదాయం తెచ్చారన్నారు. ఇదే స్ఫూర్తితో అందరూ పని చేయాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు పడకుండా పాసులు మంజూరు చేయాలన్నారు. పాఠశాల వద్దకే వెళ్లి బస్సు పాసులు ఇవ్వడం పట్ల వన్,టు డిపో డీఎంలను అభినందించారు. వన్,టు డిపోల్లో స్పెషల్ బస్సుల్లో అత్యధిక ఆదాయం తెచ్చిన సిబ్బందిని ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సీఐలు రేవతి, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న స్కూల్‌బస్సు క్లీనర్



సుబ్బరాజును అభినందిస్తున్న సీఐ మహబూబ్‌బాషా

మదనపల్లె : లక్షకు పైగా విలుచేసే ఐఫోన్ దొరికితే ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు క్లీనర్ నిజాయితీగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పజెప్పిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా ఈ విషయమై మాట్లాడుతూ... కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన అరుష్‌అభినవ్ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అతడు ఐఫోన్‌ను మదనపల్లెలో పోగొట్టుకున్నాడు. ఇండియన్ పబ్లిక్ స్కూల్ సమీపంలో ఫోన్ పడి ఉండగా గమనించిన స్కూల్ బస్సు క్లీనర్ ఎస్.సుబ్బరాజు భద్రంగా తీసుకెళ్లి వన్‌టౌన్ సీఐకు అప్పగించాడు సీఐ సుబ్బరాజును అభినందించి, ఫోన్ సొంతదారుడు అభినవ్‌కు సమాచారం అందించి అప్పగించారు.

రామకుప్పం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

వాల్మీకిపురం : దళితులను బెదిరించి, కులం పేరుతో దూషించిన రామకుప్పం ఎస్ఐ క్రిష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు శివారుపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకుప్పం మండలం ఉన్నిగానిపల్లి మాజీ సర్పంచ్ మహదేవ ఈ నెల 5వ తేదీ గోవిందపల్లి గ్రామంలో జరిగిన సంఘటనపై రామకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ క్రిష్ణయ్య కేసు నమోదు చేయకపోవడంతో కుప్పం సీనియర్ సివిల్ కోర్టు జడ్జిని ఆశ్రయించడంతో ఎస్ఐ క్రిష్ణయ్యని పిలిపించిన కోర్టు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. దళితుల పట్ల ఎస్ఐ క్రిష్ణయ్య వ్యవహార శైలిపై చిత్తూరు జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తొలగించకపోతే మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

చిరుధాన్యాల సాగుతో అధికలాభాలు

నిమ్మనపల్లె : చిరుధాన్యాల సాగుతో రైతులు అధికలాభాలు పొందవచ్చని రైతుభరోసా కేంద్రాల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీకాంత్ అన్నారు. శనివారం నిమ్మనపల్లె సింగిల్‌విండో కార్యాలయంలో చిరుధాన్య పంటలసాగు, యాజమాన్య పద్ధతులు, ఉత్పత్తుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. చిరుధాన్యాల పంటల సాగును పెంచేందుకు, రైతుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిరుధాన్యాలలో వకుల, తిరుమల, ఇంద్రావతి వంటి మేలైన రకాలను సాగుచేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. రాగి, సజ్జ, కొర్రలు, సాములు, అరికెలు వంటి చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. ఎకరం పొలానికి 24కిలోల నత్రజని, 12కిలోల భాస్వరం, 8కిలోల పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలని తెలిపారు. తక్కువఖర్చు, నీటితో స్వల్ప కాలంలో చిరుధాన్యాలను సాగు చేయవచ్చన్నారు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ప్రతిరోజు చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, కుమార్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

కలికిరి: ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు కళ్యాణి శనివారం విలేకరులకు తెలిపారు. బాధితురాలి కథనం మేరకు.. కలికిరి సమీపం సీఎల్ఆర్‌సీ కార్యాలయం వద్ద 2008లో ఇచ్చిన ఇంటి స్థలాన్ని కలికిరి పాట్టేకులవారిపల్లికి చెందిన సిద్దాచారి ఆక్రమించుకొని కట్టడాలు చేపడుతున్నాడు. తమ స్థలంలో నిర్మాణాలు వద్దనడంతో సిద్దప్ప, అతని అనుచరులు తనపై దాడి చేసి, తనతో పాటు తన కుమార్తెలను కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలను విచారించి రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారన్నారు. తమకు రికార్డు పక్కాగా ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. ఈ మేరకు పోలీసులు, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

కిక్కిరిసిన అంగళ్లు గొర్రెల సంత



సందడిగా అంగళ్లు గొర్రెల సంత

కురబలకోట : కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు..పెద్ద చెవులతో వింతగా కన్పించిన కాశ్మీరిజాతి మేకపోతులు..మేపుకోడానికి పిల్లలు.. మరో వైపు గొర్రెలు..ఎటు చూసినా శనివారం అంగళ్లు గొర్రెల సంతలో జీవాలు కన్పించాయి. ఒకదానికి మించి మరొకటి కన్పించాయి. బక్రీద్ పండగ నేపథ్యంలో జరిగిన గొర్రెల సంత కిక్కిరిసింది. ప్రతి శనివారం అంగళ్లు టమాటా మార్కెట్ మైదానంలో గొర్రెల సంత జరుగుతుంది. చెన్నై, కర్ణాటకతో పాటు రాయలసీమ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులు వచ్చారు. పెద్ద సంఖ్యలో గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు సంతకు వచ్చాయి. పొట్టేళ్ల రేట్లు కూడా భగ్గుమన్నాయి. రూ.10 వేల నుండి అత్యధికంగా రూ. 50 వేలు చొప్పున కూడా పలికాయి. కాశ్మీరి మేకపోతులైతే రూ. లక్ష చొప్పున పలికాయి.